# ఐక్యత



* శ్రీ యడవల్లి లక్ష్మీనారాయణ *

అర్థరాత్రిపైన అరగంట దాటింది. చల్లగాలి బాగా వీస్తోంది. చెట్ల ఆకులమీద సన్న సన్నటి తుహిన బిందువులు గుమిగూడుతున్నై. అంతా నిశ్శబ్దంగా వుంది. పండు వెన్నెల భూమిపైనంతా పరచబడింది. అప్పుడప్పుడు చంద్రుడు మబ్బు మేఘపటల కొంగులోంచి తొంగి చూస్తున్నాడు. అంతా నిశ్శబ్దం. పండుటాకు క్రిందబడినా శబ్దం వినిపిస్తుంది.

ఉద్యానవనమంతా రకరకాల పూలతో విరియబూచింది.

పొడుగ్గా పెరిగిన సర్వీచెట్లు మిలిటరీ దళంలా కనిపిస్తున్నై. గుబురుగా ముళ్ళతో గుమిగూడివున్న గులాబీచెట్లకి మల్లె తీగెలు మెలికలు తిరిగినై. వికసించిన యౌవనంతో వికటంగా అట్టహాసం చేస్తోంది నైట్ క్వీన్. నగ్నంగా తన అంతర్భాగాలను మెల్లమెల్లగా చందమామకు చూపుతోంది సన్న జాజి. విచ్చీ, విచ్చని పన్నీరు పూలు సున్నితంగా ఘుమఘుమలు వెదజల్లుతున్నాయి. అప్పుడప్పుడే పుష్ప పత్రాలని విదల్చుకుంటోంది నందివర్థని.

అంతా నిశ్శబ్దంగా ఉంది.

నిశ్శబ్దానికి భంగం గల్గిస్తూ గులాబి చిటికలువేస్తూ ఆవులించింది. గులాబీచేసిన ఈ కాస్త శబ్దానికే నైట్ క్వీన్‌కు మెలకువ వచ్చింది.

గులాబి మళ్ళా నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ "ఇక్!" అని నిట్టూర్పు విడిచింది. నైట్ క్వీన్‌కు కోపం హెచ్చింది గులాబి అలా శబ్దంజేస్తూ తనకు నిద్రాభంగాన్ని గలిగిస్తున్నందుకు.

పాపం! గులాబి నైట్‌క్వీను చూడనే లేదు! నిద్రవస్తుందేమోనని అటూ, ఇటూ రెండుసార్లు మసిలింది. కాని నిద్రవచ్చే లక్షణాలేవీ కనిపించలేదు. మళ్లా చిటికలువేస్తూ ఆవులించింది. నైట్ క్వీనుకు కోపం జాస్తి అయింది.

అసలే ఇంటికీ కలహాలూ, క్రోధాలూ ఉన్నై. గులాబిని తన హస్తాలతో నలిపివేసి ఆ ఎఱ్ఱటి రక్తాన్ని పానం చేద్దామా! అన్నంత క్రోధం వుంది నైట్ క్వీన్‌కు.

నంది వర్థన, గన్నేరూ అడ్డొచ్చినై గనక గాని లేకపోతే ఇది వరకే ఎంతగోల జరగాలో అంతా జరిగేది. చేసినపనైతే తప్పేగాని నైట్‌క్వీన్ చేసిన ధైర్యం మాత్రం ప్రశంసనీయం. నిజంగా నైట్‌క్వీన్ పక్షాన ఒక్క క్రోటన్సు తప్ప మిగిలినవన్నీ వ్యతిరేకమే! గులాబి పక్షాన అంత అధ్వ

తీయమైన, అసంఖ్యాకమైన బలమున్నదని తెలిసి నప్పటికీ నైట్ క్వీన్ సాహసించి ఎదిరించినందుకు చాలా ఆశ్చర్యంగా వుంది. అయితే నిజంగా గులాబీని నైట్ క్వీన్ నాశనం చెయ్యగలదా? అసంభవము. నైట్ క్వీన్ గులాబీ నెన్నటికీ నాశనం చెయ్యలేదు. ఆ తోట గులాబీ, దాని అనుచరులది. ఈ నైట్ క్వీన్ నిన్న, మొన్న వచ్చింది. గులాబీకున్న శక్తి సామర్థ్యాలలో నాలుగోవంతైనా నైట్ క్వీన్‌కు లేవని చెప్పటం సాహసంగాదు. అయితే గులాబీ దయార్ద్రహృదయ, పాపభీతి, దైవభీతి గలది. అదేగనక కర్కోటక హృదయంతో కత్తులు నూరి నట్లయితే నైటుక్వీన్ ఏనాడో అంతరించి పోయేది ఆ పూలతోటలోంచి.

అసలు తోటమాలి నైట్ క్వీన్‌ను తోటలోకి తీసుకొచ్చినప్పుడే, ఇతర పుష్పాలు తిరుగుబాటు జేసినై "నైటుక్వీన్ క్రూరపుజాతిలోది దానికిక్కడ స్థానంలే"దని. కాని అన్నీ ఏక కంఠంతో చెప్పలేక పోయినై. దానికి వాటిల్లో వున్న అంతః కలహాలే కారణం. ఈ సదవకాశాన్ని పురస్కరించుకొని నైట్ క్వీన్ క్రమక్రమేపి తనస్థానాన్ని బలపరచుకుంది. ఆనాడు బీజరూపంలో వున్న క్రౌర్యం ఈనాడుఓ పెద్ద మ్రానైంది.

* * *

గులాబి అలా నిశ్శబ్దాన్ని భంగపరుస్తూంటే నైట్ క్వీన్‌కు వళ్లు మండింది.

ఎంతసేపటికీ గులాబీకి నిద్ర పట్టలేదు. 'శ్రీరామ! శ్రీరామ!' అంటూ నెమ్మదిగా జపం ప్రారంభించింది. ఇక నైట్ క్వీన్ క్రౌర్యాన్నాపుకోలేక పోయింది, క్రోధాన్నణచుకోలేక పోయింది, కోపాన్ని కప్పిబుచ్చలేక పోయింది.

"ఏమిటి అర్థరాత్రి నీగోల?" అని గదమాయించింది.

"ఏమీలేదు. మెలకువ వచ్చింది. ఏదో ఆలోచిస్తున్నాను" అన్నది గులాబి.

"మెల్లిగా ఆలోచించుకోలే ఏమిటి?" అన్నది కర్కశంగా నైట్ క్వీన్ చెలి క్రోటన్.

ఈ కలభాషకు గన్నేరు కాస్తా నిద్రలేచింది.

కళ్లు నలుపుకుంటూ "ఏమిటీ అర్థరాత్రి హడావుడి?" అన్నది. "ఏముంది? ఎప్పుడూ వుండే గోలే! అర్థరాత్రి ఆలోచనలుట! మొహానికి సిగ్గుండాలి!" అన్నది చీదరింపుతో నైట్ క్వీన్.

"అసలింతకీ ఏం జరిగిందేమిటి?" అని అడిగింది గన్నేరు.

"ఏం జరిగేదేమిటి? ఏం జరగాలేం? అర్థరాత్రి నిద్రచెడగొట్టితే ఎవరు ఏమంటారు?"

"ఇప్పుడు నీ నిద్ర నేనేం చెడగొట్టాను?" అన్నది గులాబి నైట్ క్వీన్ కళ్ళల్లోకి చూస్తూ.

"ఇంకా సిగ్గులేక మాట్లాడుతావేం?" అని గర్జించింది నైట్ క్వీన్. ఈ గర్జనకు సన్నజాజి, బంతి, చామంతి, సంపెంగ, మల్లె మొదలైన మిగతావి గూడ ఉలిక్కిపడి లేచినై.

"ఏమిటోయ్ ఈగోల?" అని సన్నజాజి మల్లె భుజంతట్టి అడిగింది.

"నీకేం తెలుసో నాకూ అంతే తెలుసు. ఈగోలకే నేను ఇప్పుడే నిద్రలేచాను."

సన్నజాజి నోరుతెరచి చూచింది నైట్ క్వీన్ వంక గృహప్రవేశంలో ప్రసాద్ లాగా.

"నీ నిద్రేం చెడగొట్టానని దబాయిస్తావేం?" అని గదమాయించింది క్రోటన్ గులాబిని.

"ఏదో ఆలోచిస్తోందిట!" అన్నది నైట్ క్వీన్ గులాబిని అపహాస్యం జేస్తూ.

"ఏమిటా ఆలోచన? మాకొంపముంచే ఆలోచనేనా?" అన్నది క్రోటన్.

"ఓ చక్కటి ఆలోచన!" అంది గులాబి.

"ఏమిటో అది?" అన్నది సన్నజాజి మల్లెను నెట్టుకొని ముందుకొచ్చి.

"మనకందరికీ ఎంతో లాభం గల్గుతుంది"

"అంటే?" అన్నట్లుగా నందివర్ధని తల పైకెత్తి గులాబి కళ్ళల్లోకి చూచింది.

"మనకీ తోటమాలి ఆధిపత్యం, అధికారం పోతుంది. ఈ తోటమాలి మనల్నెంతో బాధపెడుతున్నాడు. ఈ విషయాన్ని మీరంతా అంగీకరిస్తారా?" అని ఓకన్ను నైట్‌క్వీన్ మీదా, మరో మల్లెమీదా వేసింది గులాబి.

"తోటమాలి దుర్మార్గాలు నానాటికి మితిమీరిపోతున్నై వాటినీ వెధవేం ఆపగల్గు?" అన్నది నైట్‌క్వీన్ క్రోటనుతో మెల్లగా.

"ఉపాయమేం చెబుతుందో విందాం. వీలైతే మనంగూడా దాన్నే అనుసరిద్దాం. ఈ తోటమాలి నిరంకుశ దారుణకృత్యాలు నానాటికి పెచ్చుపెరిగిపోతున్నై. ఎలాగైనా ఈపీడను వదల్చుకోవాలి" అన్నది క్రోటను.

"చూద్దాం చూద్దా. ఏం చెబుతుందో?"

"ఏదేదో వస్తున్న చెబుమా!" అన్నది సన్నజాజి గులాబీమీద చెయ్యివేసి—

"దానివల్ల లాభాలేమిటో ముందు చెప్తావా?" అన్నది గులాబి.

"లాభాలూ చెప్పక్కరలేదు. ఏమీ చెప్పక్కరలేదు. అన్నీ మాకు తెలుసు. ఈ తోటమాలి నిరంకుశత్వం రూపుమాసిపోతే ఇంక కావలసిందేముంది?" అన్నది పారిజాతం.

గులాబీ గొంతు సవరించుకుంది.

"అదుగో-గులాబి మనం తోటమాలిపెట్టే బాధలనుంచి విముక్తి నెలాబొంది స్వరాజ్యాన్ననుభవించగలుగుదుమో చెబుతోంది. ఏం తొనికిపాట్లు పడుతావ్ విను!" అని హెచ్చరించింది సన్నజాజి చామంతిని.

గులాబీ ఇలా చెప్పటం ప్రారంభించింది:

"మనమంతా ఐకమత్యంగా ఉంటే మనకి తోటమాలి దురంతాలు రూపుమాసిపోతై. మనలో

శ్రేష్ఠమైన సిరా
కాని
చవకయైన ధర


జాబ్కో
ఫౌంటింక్
ఏ నగరంలోనైనా ఏ దుకాణంలో
నైనా సరే కొనండి.
★
జయభారతమ్ కో.,
మద్రాసు-బెంగళూరు-ఎర్నాకులం.

మనం కొట్లాడుకొని, పోట్లాడుకొని క్రోధాలు పెంచుకుంటే మనకిదేగతి! మనకు విముక్తి అంటూ ఉండదు..."

"నీకంటే పోట్లాటేదెవరు?" అన్నది మెల్లగా నైట్‌క్వీన్ క్రోటన్‌తో మరెవ్వరికీ వినబడకుండా.

"......కనుక మనలో మనకు ఐకమత్యం అత్యవసరం. మనమంతా ఏకకంఠంతో "ఈ పుష్ప వనంమాది. మాపాలనను మేమే చేసుకుంటాం. రోజూ మా ధనాన్ని, మా సర్వస్వాన్ని మాదగ్గర నించి లాక్కెళ్లుతున్నావు. దీన్నిచూచి ఇక మేము భరించలేము. ఇకమీద మాబాధ్యతను మేమే చూచుకుంటాం. మావనంలో నీకు స్థానంలేదు. ఇదంతా మారాజ్యం. మారాజ్యంలో మా పరిపాలనను సాగించుకుంటాం. పరాయిప్రభుత్వం మా రాజ్యంలో పనికిరాదు. ఇప్పటిదాకా మారాజ్యాలు అధికారాన్ని చెలాయిస్తూ రోజు రోజూ మా ఆస్తినంతా ఉదయాన్నేవచ్చి నీ గృహానికెగుమతి చేస్తున్నావు. ఇకమీద ఇలాంటి చేష్టలు సాగవు. మావనాన్ని విడిచివెళ్ళిపో (Quit garden)" అని తోటమాలితో చెప్పాలి. అప్పుడెవరికోసం అతను తన అధికారాన్ని త్యజిస్తాడు? అప్పటికి వెళ్ళకపోతే మనమంతా కలిసి తిరుగుబాటుచేద్దాం—"

"తిరుగుబాటేమిటి? అతన్నీ, అతని అనుయాయుల్నీ సమూలంగా నాశనం చెయ్యం? ఈ ఊహ, ఈ ఉపాయం నీకు తట్టినందుకు చెప్పాలి! ఇంతకాలం నించీ ఈ తోటమాలి నిరంకుశ క్రూరచర్యల్ని అనుభవిస్తున్నప్పటికీ మాకెవ్వరికి ఇలాంటి ఊహతట్టలేదు. ఎంతోకాలంనించీ ఈవిధంగా మనం తోటమాలి చేతుల్లో నలిగిపోతున్నాం. మన సర్వస్వాన్ని దోచుకొని మనల్ని నానాటికి నిర్భాగ్యుల్నిగా, నిర్వీర్యుల్నిగా చేసేస్తున్నాడు. ఇకమీద ఈ బానిసత్వాన్ననుభవించలేం. మనకు స్వాతంత్రం రావాలి! మనం స్వతంత్రులం కావాలి!" అన్నది ఆవేశంతో చామంతి.

"తొందరగా చెప్పు" అన్నది గన్నేరు గులాబితో.

"ఆచెప్పి ఏడ్చేదేదో తొందరగా చెప్పకూడదూ?" అన్నది మూతిముడుచుకొని నైట్‌క్వీన్.

ఒక్కసారి అంతా నిశ్శబ్దంగాఉన్నై. చీమ చిటుక్కుమన్నా శబ్దం వినిపిస్తోంది.

గులాబి అటూ, ఇటూ చూచి తలపైకెత్తి "కనుక ఐకమత్యం మనలో అత్యవసరం. మనమంతా ఐక్యకంఠంతో తోటమాలిని ఎదిరించిన పుష్ప రాజ్యాన్ని మనం హస్తగతం చేసుకోవాలి. పరాయి పాలన మనకు పనికిరాదు. మీరేమంటారు?" అని ప్రశ్నిస్తూ అందరివైపు చూచింది.

"నువ్వు చెప్పింది చాలా బాగుంది. మనం స్వతంత్రంగా ఉండాలి! మనపరిపాలనను మనమే చేసుకోవాలి! తెల్లవారగానే తోటమాలి వస్తాడు. అతనుతోటలోకి అడుగుపెట్టగానే మనమంతా ఐక్యకంఠంతో ఎదిరించాలి! రేపటినించి స్వరాజ్యపాలనను కొనసాగించాలి! అన్నది నందివర్ధని.

అప్పటిదాకా నిదానంగాకూర్చొని వింటున్న నైట్‌క్వీన్ ఆవేశంతో, ఉద్వేగంతో లేచినిలబడి "అది మేము ఒప్పుకోము" అన్నది నిష్కర్షగా.

"ఎందుకని?"

"ఎందుకేమిటి? మీకూ, మాకూ బద్ధవిరోధం ఇప్పుడు తోటమాలి అధికారంలో ఉంటున్నాం. గనుక కలహాలూ, కల్లోలాలూ, కొట్లాటలూ ఎక్కువగాలేవు. మీరేమైనా దుర్మార్గాలుచేస్తే వేరుతోటమాలికి ఫిర్యాదు చేసుకుంటున్నాం. రేపటినించీ మీపరిపాలన వచ్చేటట్లయితే మాగతి నిర్గతిఅవుతుంది అధిక సంఖ్యాకులుమీరు. అల్పసంఖ్యాకులం మేము. మీపరిపాలనలో మాకు దుర్మార్గాలూ, అశాంతి,

…త్ర్యాలు కలుగుతై, అందుచేత మేముదీనికంగీకరించం.''

''ముందు పరాయిప్రభుత్వం పోతే తరువాత మనసంగతి ఆలోచించుకోవచ్చు. ముందు తోటమాలి ప్రభుత్వంపోవాలి!''

''అలా మేము ఒప్పుకోం. పరాయిప్రభుత్వం పోతే మాకెన్నో అనర్థాలున్నై. ముందుమాసంగతి పరిష్కరింపబడాలి. మీపరిపాలన క్రింద మేముండము. ఈ పుష్పవనంలో కొంతభాగాన్ని మాకిచ్చివేయాలి. అక్కడ మాపరిపాలనను సాగించుకుంటాం మిగతా భాగంలో మీపరిపాలనను సాగించుకోండి!''

''ఒకేరాజ్యాన్ని రెండుగా విభజించటం అర్థవిహీనంగదూ?'' అన్నది సన్నజాజి గులాబికేసి చూస్తూ.

''అయితే మీకేభాగంకావాలేం?'' అన్నది గులాబి [illegible]తో.

''ఏభాగమేమిటి? ఈతోటలో మీవాళ్ళున్నారు. మావాళ్ళున్నారు. మావాళ్ళధికంగా ఉన్నప్రాంతాలు మాపరిపాలనలోకి రావాలి!

''ఒకేవనంలో రెండుభాగాలేమిటి? రెండు రాజ్యాలేమిటి? ఒకేవరలు రెండుకత్తులిముడుతయ్యా?''

''మాకలా విభజన జరగాలిసిందే! లేకపోతే మేమంగీకరించం!''

''ఒప్పుకోక ఏంజేస్తారు? మీరెంత మీబ్రతుకెంత?'' అన్నది బొడ్డుమల్లె.

''ఇదిగో నువ్వు శాంతించు హింసాయుతమైన పద్ధతుల్ని పశుబల ప్రయోగాన్ని చేసామంటే మానవత్వాన్ని మంట గలిపామన్నమాట! అంటూ బొడ్డుమల్లె నారడించింది గులాబి.

''ఒప్పుకోకపోతే ఏంజేస్తారని అడుగుతున్నావే? ఏంజేస్తామా?'' అని పళ్లు పటపటకొరికి

స్టార్ ఆఫ్ ఇండియా పెన్సిళ్లకై

దిమద్రాస్
పెన్సిల్ ఫ్యాక్టరీని.,
కోరండి.

✱

హిగ్గిన్‌బాథమ్స్... 

హోరా & కో.,
ఉన్నతశ్రేణికి చెందిన ముద్రణకు,
లిథోగ్రఫీకీ పేరుబడింది.

✱

వి. పెరుమాళ్ చెట్టి & కో.,
అన్నిరకాల స్టేషనరీ
లభ్యమగును.

5 స్ప్రింగర్స్ వీధి,
జి. టి. మద్రాసు.

"చేసేదేచేస్తాం మాతడాఖా చూపిస్తాం మిమ్మల్నంత నాశనంచేసి అయినా మేము మారాజ్యాన్ని స్థాపించుకుంటాం, తెలుసా." అంటూ ఒక్కసారి కళ్ళు ఝళిపిస్తూ లేచినిలబడ్డది. నైట్‌క్వీన్‌దాంతోపాటే క్రోటన్‌గూడా శౌర్యంతో లేచింది.

"గులాబిని అతని అనుచరుల్ని నాశనం చెయ్యండి." అనిగర్జించింది నైట్‌క్వీన్.

పూలతోట అంతా కొట్లాటలతో నిండిపోయింది. భయంకరంగా ఆర్తనాదాలు వినిపిస్తున్నై. రక్తం కాల్వలుగట్టుతోంది.

ఇంతలోకే తోటమాలివచ్చాడు. అంతాగప్. చిప్. కూయ్, కూయ్ లాడలేదు. గబగబావచ్చి తోటమాలి అన్నిపూలనూ త్రుంచుకొని వెళ్ళిపోయాడు.

"నిజమేఅది! బుద్ధితక్కువై అనవసరంగా కొట్లాటల్లోకి దిగాను. రేపుచూద్దాం తోటమాలిఎలా తనఅధికారాన్ని చెలాయిస్తాడో!" అన్నది నైట్‌క్వీన్.

దీనంతకు చూస్తూనే ఉన్నాడు పైనించి దినకరుడు. చిలిపిగా ఒక్కనవ్వు నవ్వి హిందూస్థాన్, పాకీస్థాన్, గూడా ఇంతేగదా అనుకున్నాడు.

---

బాలబాలికలకు రష్యాలో ట్రాములలోనూ, బస్సులలోనూ, ట్రెయిన్లలోనూ కొన్ని సీట్లు వున్నాయి. మెట్రో, సబర్బన్ ట్రెయిన్లలో ప్రత్యేకంగా కొన్నిపెట్టెలు పిల్లలకు వున్నాయి. ఉదయాన కొన్ని సినిమాలలో పిల్లలకు ప్రత్యేక ప్రదర్శనలు వుంటాయి.

మిత్రులందరికీ ఒక శుభవార్త!

1947 వ సంవత్సరపు నూతన రకముల

చీరలు

తయారై ఎక్కువగా అమ్మబడుచున్నవి.

నేడే మీకు కావలసిన నూతనపు దుస్తులను కొని ధరించి ఆనందించండి.



దొరకుచోటు :

మధుర నేతగాండ్ల సహకార, ఉత్పత్తి & అమ్మకపు సంఘం లిమిటెడ్.
211, తూర్పు మారెట్ వీధి, మధుర.

The Madura Weavers' Co-operative Production & Sale Society Ltd.
211, East Marret St., MADURA.